

నోటాకు 18,229 ఓట్లు

సాలూరు రూరల్, జూన్ 6: ఈ ఎన్నికల్లో జిల్లాలో నోటాకు 18,229 ఓట్లు పడ్డాయి. సాలూరు నియోజక వర్గంలో 5,743, పార్వతీపురంలో 3,465, కురుపాంలో 4,761, పాలకొండ నియోజకవర్గంలో 4,260 ఓట్లు నోటాకు పడ్డాయి. గిరిశిఖర గ్రామాల్లో ఉన్న పోలింగ్‌స్టేషన్లలో సైతం నోటాకు ఓట్లు పడడం విశేషం. పోస్టల్ బ్యాలెట్లలో కూడా నోటాకు ఓటు వేశారు. నాలుగు నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో 16,478 ఓట్లు నోటాకు లభించగా ఈ ఎన్నికల్లో 18,229 ఓట్లు లభించాయి. గతం కంటే 1,751 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. సాలూరులో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీఎస్పీల అభ్యర్థుల కంటే నోటాకు అధికంగా ఓట్లు రావడం విశేషం.

కష్టపడ్డారు.. గెలుపొందారు

- ఐక్యంగా పనిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు
- జిల్లాలో నాలుగు స్థానాలూ కైవసం

పార్వతీపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కష్టే ఫలి అనడానికి నిదర్శనం కూటమి నాయకులు, కార్యకర్తలు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, అవంతరాలను దాటుకొని వైసీపీ సర్కారుకు ఎదురొడ్డి పోరాడారు. అంతా ఒకే మాట.. ఒకే బాటగా ప్రజల్లోకి వెళ్లారు. జిల్లాలోని నాలుగు స్థానాలనూ కైవసం చేసుకొని కొత్త చరిత్రను లిఖించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం స్థాయి వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. అనేక గ్రామాలు, పట్టణాల్లో వారిని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశారు. పోలీసు కేసులు పెట్టి హింసించారు. టీడీపీ జెండా మోయవద్దని హెచ్చరించారు. అయినా అదరలేదు.. బెదరలేదు. మరింతగా కష్టపడి తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి చేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా పని చేశారు. కూటమి అభ్యర్థుల విజయం కోసం విశ్రాంతి లేకుండా కష్టపడ్డారు. దీంతో జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించారు.

చంద్రబాబు అరెస్టుతో పెరిగిన కసి..

తమ అధినేత నారా చంద్రబాబునాయుడును వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని జిల్లాలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంతో బాధపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కష్టపడిన చంద్రబాబును అన్యాయంగా జైలుకు పంపిం చారని ఆవేదన చెందారు. అప్పుడే ఒక నిర్ణయానికి వచ్చారు. ఎలాగైనా వైసీపీ ప్రభుత్వాన్ని కాలగర్భంలో కలిపేయాలనే కసి ఏర్పడింది. అప్పటి నుంచి టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజల్లోకి వెళ్లారు. చం ద్రబాబు అక్రమ అరెస్టును ప్రజలకు వివరించడంలో సఫలీకృతులయ్యారు. చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేయడంపై వెల్లువెత్తిన నిరసనలను ప్రజలు గమనించారు. జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించాలని అప్పుడే దాదాపు నిర్ణయించుకున్నారు. గత నెల 13న జరిగిన ఎన్నికల్లో ఓటు ద్వారా కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి వైసీపీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేశారు. ఇందులో కూటమి నాయకులు, కార్యకర్తల కృషి కూడా చాలా ఉంది. ప్రజలను చైతన్యపర్చడంలో వారు సఫలీకృతులయ్యారు. దీంతో నాలుగు నియోజకవర్గాల్లో కూడా వైసీపీ పూర్తిగా తుడుచుకుపోయింది.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం..

టీడీపీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నాయకులు, కార్యకర్తలు రాజీలేని పోరాటం చేశారు. నిత్యావసరాల ధరలు, ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తదితర అంశా లపై ప్రజల తరఫున పోరాడారు. అదే విధంగా చంద్రబాబును మళ్లీ ముఖ్య మంత్రి చేస్తే రాష్ట్రం బాగు పడుతుందని, ప్రజలు కష్టాలు తీరుతాయని ముమ్మర ప్రచారం చేశారు. ఆ ఫలితమే నేడు జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల్లో కూటమి అభ్యర్థులకు గెలుపునకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు విజయచంద్ర, సంధ్యారాణి

పార్వతీపురం(ఆంధ్రజ్యోతి)/సాలూరు రూరల్, జూన్ 6: టీడీపీ అధినేత, కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గురువారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు వారు శుభాకాంక్షలు తెలిపారు. సాలూరులో దశాబ్దంన్నర తరువాత టీడీపీ విజయం సాధించడంతో సంధ్యారాణిని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.





చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యేలు విజయచంద్ర, సంధ్యారాణి

అలాగే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, హిందుపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవచేయడమే లక్ష్యంగా పనిచేయాలని లోకేష్ వారికి సూచించారు.

కేజీబీవీలపై ఆసక్తి అంతంతే



ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో విద్యార్థినులు తగ్గుతున్నారు. ఏటా వాటిలో ప్రవేశం పొందే బాలికల సంఖ్య తగ్గుతోంది. పేద బాలికలకు ఉన్నత విద్య అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటైన వీటిపై ఎందుకు ఆసక్తి తగ్గుతోందో తెలియక, సీట్లు భర్తీకాక ప్రత్యేకాధికారులు, సీఆర్టీలు మల్లగుల్లాలు పడుతున్నారు. తల్లిదండ్రులకు అవగాహన ఉండడం లేదా? లేక ఉత్తమ బోధన అందదని అపోహ పడుతున్నారో తెలియడం లేదని వారు చెబుతున్నారు. ఆరోతరగతి, ఇంటర్‌లో ఏటా సీట్లు భర్తీ కావడం లేదు.

రాజాం, జూన్ 6

- తగ్గుతున్న బాలికల ప్రవేశాల సంఖ్య
- ఆరో తరగతి, ఇంటర్‌లో నిండని సీట్లు
- తల్లిదండ్రులకు అవగాహన లేమి కారణమా?
- మల్లగుల్లాలు పడుతున్న ప్రత్యేకాధికారులు, సీఆర్టీలు

పేద, సామాన్య వర్గాల విద్యార్థినుల కోసం ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తల్లిదండ్రులు లేకపోయినా, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస పోయినా వారి పిల్లలకు వసతితో కూడిన విద్య అందించేందుకు 2008లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పాఠశాలలను ప్రారంభించాయి. జిల్లాలో 33 మండలాల్లో వీటిని ఏర్పాటుచేశారు. తొలుత 6 నుంచి పదో తరగతి వరకూ ఉన్న ఈ పాఠశాల్లో రెండు సంవత్సరాల కిందట ఇంటర్ కూడా ప్రవేశపెట్టారు. సంప్రదాయ కోర్సులతో పాటు ప్రత్యేక సాంకేతిక కోర్సులను సైతం అందుబాటులోకి తెచ్చారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, కంప్యూటర్, ట్యాలీ వంటి వృత్తివిద్యా కోర్సులను కూడా అందిస్తున్నారు. ఇంత చేస్తున్నా విద్యార్థినులు అక్కడ చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. గత విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరు, ఇంటర్‌లో ప్రవేశాలకు జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చారు. ఏడు, ఎనిమిది తరగతుల్లో ఖాళీలకు సైతం దరఖాస్తులు ఆహ్వానించారు. జూలై 25తో గడువు ముగిసినా....చాలా కేజీబీవీల్లో సగం సీట్లు కూడా నిండని పరిస్థితి. దీనిపై పాఠశాలల ప్రత్యేకాధికారులు, సీఆర్టీలు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో బాడంగి, బలిజిపేట, భోగాపురం, బొబ్బిలి, బొండపల్లి, చీపురుపల్లి, జియ్యమ్మవలస, డెంకాడ, దత్తిరాజేరు, గంట్యాడ, గరివిడి, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, గజపతినగరం, గుర్ల, జామి, సీతానగరం, పార్వతీపురం, కొమరాడ, కొత్తవలస, కురుపాం, ఎల్.కోట, మక్కువ, మెంటాడ, మెరకముడిదాం, నెల్లిమర్ల, పాచిపెంట, పూసపాటిరేగ, రామభద్రపురం, సాలూరు, తెర్లాం, వేపాడ, విజయనగరంలో కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. ఆరు నుంచి ఇంటర్ వరకూ ఇక్కడ విద్య అందిస్తున్నారు. ప్రతీ తరగతిలో 40 సీట్లు చొప్పున ఉంటాయి. తల్లిదండ్రులు లేని పిల్లలకు ఇక్కడ ప్రాధాన్యమిస్తారు. కంప్యూటర్ విద్యతో కూడిన ఉత్తమ విద్యాబోధన అందిస్తారు. సబ్జెక్టుల వారీగా మహిళా ఉపాధ్యాయులు (సీఆర్టీలు)ను నియమించారు.

వసతులు ఉన్నా..

కేజీబీవీ పాఠశాలల్లో పౌష్టికాహారంతో పాటు అన్నిరకాల వసతులు అందుబాటులోకి తెచ్చారు. ప్రతిరోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం ఉంటుంది. మధ్యలో స్నాక్స్, బూస్టు, హార్లిక్స్, పాలు కూడా అందిస్తారు. వారంలో రోజుకో మెనూ ఉంటుంది. ఆత్మరక్షణకు కరాటే, ఆరోగ్యానికి యోగా సైతం నేర్పిస్తారు.

పరిష్కారం కాని సమస్యలు


సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో ఉండే ఈ పాఠశాలల్లో నిధుల ఖర్చు విషయంలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. సీఆర్‌టీలు, ప్రత్యేకాధికారి పాఠశాలలోనే ఉండాలి. కానీ వేరొక చోటు నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. చాలా పాఠశాలలకు ఇప్పటికీ ప్రత్యేకాధికారులు లేరు. ఇంటర్‌కు సంబంధించి అధ్యాపకులు కూడా తగినంతమంది లేరు. ఈ కారణంతోనే తల్లిదండ్రులు పిల్లలను కేజీబీవీలకు పంపడం లేదేమో.

కేజీబీవీల్లో చేరండి

కేజీబీవీ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధనతో పాటు పౌష్టికాహారం అందిస్తాం. బాలికా రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రుల మాదిరిగానే వారిని కంటికిరెప్పలా చూసుకుంటాం. ఈ విషయం తల్లిదండ్రులు గమనించాలి. తల్లిదండ్రులు లేకపోయినా, వలసపోయినా అటువంటి పిల్లలంతా తప్పకుండా పాఠశాలల్లో చేరేందుకు ముందుకు రావాలి.

-పల్లి సావిత్రి, ప్రత్యేకాధికారి, కేజీబీవీ, రాజాం

ముగిసిన ఎన్నికల కోడ్



గరుగుబిల్లి, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల కోడ్ గురువారంతో ముగిసింది. ఈ ఏడాది మార్చి 16న ఎన్నికల కోడ్ అమలు చేస్తూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ చేసింది. నామినేషన్లు ప్రక్రియకు ఏప్రిల్ 25, పరిశీలనకు 26, ఉపసంహరణకు ఏప్రిల్ 29వ తేదీ గడువు విధించింది. మే 13న పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూములకు చేర్చారు. ఓట్ల లెక్కింపును ఈ నెల 4న చేపట్టారు. తదుపరి ఫలితాలు ప్రకటించారు. దీంతో ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. అయితే, గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేలా 144 సెక్షన్ అమలు చేశారు. గెలుపొందిన పార్టీల అభ్యర్థులతో పాటు అభిమానులు ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించకుండా పోలీస్ యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. సుమారు రెండు నెలలకు పైగా ఎన్నికల నిబంధనలు విధించారు. గురువారం నుంచి ఎన్నికల కోడ్‌ను ఎత్తివేశారు. దీంతో పలు కార్యక్రమాల నిర్వహణకు ఆటంకం ఉండదు. ప్రస్తుతం నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కార్యక్రమాలు చేపట్టేందుకు కొంతమేర సమయం పట్టే అవకాశం ఉంది.

చింతలగూడలో పొగమంచు


దారపాడు పంచాయతీ పరిధిలో ఉన్న చింతలగూడ కొండశిఖర ప్రాంతంలో గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో పొగమంచు దట్టంగా కురిసింది. వేసవిలో పొగమంచు ఏర్పడడంతో గిరిజనులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క మంచు.. మరోపక్క ఎండల తీవ్రత అధికంగా ఉందని చెబుతున్నారు.

-సీతంపేట



పొగమంచు దృశ్యం

ఆ నిధులు ఏమయ్యాయి?




పెద్దగెడ్డ ప్రాజెక్టు

- జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణకు రూ.కోట్లు మంజూరు
- అయినా పూర్తికాని పనులు
- కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆపేసిన వైనం
- నిధులను ఏం చేశారని వైసీపీ సర్కారును ప్రశ్నిస్తున్న రైతులు

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

తమది రైతుల పక్షపాతి ప్రభుత్వమని చెప్పుకుంటూ వైసీపీ సర్కారు ఐదేళ్ల కాలం గడిపేసిందే తప్ప వారికి చేసిన మేలు ఏమీ లేదు. జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కాలువల ఆధునికీకరణ పనులను అటకెక్కించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి జపాన్ నిధులు మంజూరయ్యాయి. కానీ, పనుల పూర్తిచేయడంలో వైసీపీ సర్కారు అలసత్వం వహించింది. దీంతో సక్రమంగా సాగునీరు అందక జిల్లాలోని అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని వెంగళరాయి సాగరం ఆధునికీకరణకు రూ.63.50కోట్లు, ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌కు రూ.44.85 కోట్లు, పెద్దగెడ్డ రిజర్వాయర్‌కు రూ.28.18 కోట్లు, పెదంకలం ప్రాజెక్టుకు రూ.15.95కోట్ల చొప్పున గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జపాన్ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రాజెక్టుల పరిధిలో ఉన్న కాలువల అభివృద్ధి, లైనింగ్ పనులు, శిథిలావస్థలో ఉన్న స్ట్రక్చర్ పునర్నిర్మాణం, స్పిల్‌వే ప్రధాన మదుములు, తదితర పనులను అత్యవసరంగా చేపట్టాల్సి ఉంది. అయితే, పనులు చేపట్టే సమయంలో టీడీపీ ప్రభుత్వం మారిపోయింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కారు ఈ పనులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. సాలూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న వీఆర్‌ఎస్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.10.7కోట్ల పనులు చేశారు. దీనిలో సుమారు రూ.6.28కోట్ల పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశారు. కానీ, కాంట్రాక్టర్ బిల్లుల చెల్లింపు జరగలేదు. దీంతో, లైనింగ్ తదితర పనులను కాంట్రాక్టర్ నిలిపివేశాడు. పాచిపెంట మండలంలో పెద్దగెడ్డ రిజర్వాయర్‌కు సంబం ధించి సుమారు రూ.4.80కోట్ల విలువైన పనులను పూర్తి చేశారు. కాంట్రాక్టర్‌కు రూ.1.40కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కురుపాం నియోజకవర్గంలో వట్టిగెడ్డ రిజర్వాయర్ ఆధునీకరణకు రూ.3.90కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులకు రూ.2.62కోట్లు బిల్లులు చెల్లించలేదు. పార్వతీపురం నియోజవర్గ పరిధిలో పెదంకలాం ఆనకట్ట పనుల కోసం రూ.65 లక్షలు ఖర్చు పెట్టారు. దీనికి సంబంధించి కాం ట్రాక్ట ర్‌కు చెల్లింపులు జరగలేదు. వాస్తవానికి జపాన్ నిధులు మంజూరైన తర్వాతే చేపట్టాల్సిన పనులకు సంబంధించి అధికారులు టెండర్లు, తదితర ప్రక్రియలను పూర్తి చేశారు. కాంట్రాక్టర్లతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. కానీ, చేపట్టిన పనుల ప్రాప్తికి వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దీంతో ఆ నిధులు ఎటుదారి మళ్లించిందో అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా, ఈ నాలుగు ప్రాజెక్టుల పనులు నిలిచిపోవడంతో ఖరీఫ్‌కు సాగునీరు సక్రమంగా అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



వట్టిగెడ్డ ప్రాజెక్టు



వీఆర్‌ఎస్ ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన పనులు



పెద్దగడ్డ పరిధిలో చేపట్టిన పనులు



ఆ విశ్వాసం పవన్ కళ్లలో కనిపించింది

పరుచూరి గోపాలకృష్ణ



ఆంధ్రప్రదేశ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అసాధారణ విజయం సొంతం చేసుకున్న కూటమికి చిత్ర పరిశ్రమ నుంచి శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ చంద్రబాబుకి, పవన్‌కల్యాణ్‌కు అభినంద నలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పవన్‌కల్యాణ్‌ను ప్రశంసిస్తూ 'పవన్‌కు బిడియం ఎక్కువ. కానీ ఈ ఎన్నికల కోసం ఎంతో ఆత్మవిశ్వాసంతో పని చేశారు. 'నేను సాధిస్తున్నా' అనే విశ్వాసం ఆయన కళ్లల్లో కనిపించింది. పవన్‌కల్యాణ్ అభిమానులు ఎంత ఎమోషనల్‌గా ఉంటారో నాకు తెలుసు. కూటమి ఏర్పాటులో పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించి, ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన తర్వాత కూడా ఆయన ఎంతో విన యంగా ఎవరినీ నిందించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలా అనే ఆలో చనతోనే మాట్లాడారు. అది పవన్ గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం' అన్నారు.

అందరినీ ఆకట్టుకుంటుంది



'గూఢచారి', 'మేజర్' చిత్రాలతో దర్శకుడిగా టాలీవుడ్‌లో తనదైన ముద్రవేశారు శశి కిరణ్‌తిక్క. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' సినిమాకు ఆయన స్ర్కీన్‌ప్లే అందించడమే కాకుండా సమర్పకులుగా వ్యవహరించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా శశి కిరణ్‌తిక్క మీడియాతో ముచ్చటించారు "ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. థియేటర్స్‌లో సినిమాను చూసేటప్పుడు ఇందులోని ఎమోషన్స్‌తో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారు. దర్శకుడు సుమన్ సినిమాను గ్రిప్పింగ్‌గా తీసిన విధానం, కాజల్ ఎనర్జిటిక్ యాక్టింగ్, శ్రీ చరణ్ సంగీతం ఈ సినిమాకు పెద్ద హైలైట్స్" అని చెప్పారు.

క్లీన్ చిట్ వచ్చే వరకూ..



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్ట్ అయిన నటి హేమను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) గురువారం సస్పెండ్ చేసింది. డ్రగ్స్ కేసుపై వివరణ ఇవ్వాలని హేమకు నోటీసు పంపించినా ఆమె స్పందించకపోవడంతో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో హేమకు క్లీన్ చిట్ వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని 'మా' కార్యవర్గం తెలిపింది.

బ్లాక్‌బస్టర్ గ్యారంటీ



శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించగా, టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ "ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ గ్యారంటీ" అని చెప్పారు. "కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ అన్నారు.











ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దవుతుంది

కొత్తవలస: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే తన రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపైనే చేస్తానని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ తప్పక నెరవేరుతుందని కొత్తవలస న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీపీఎల్‌దేవి, కార్యదర్శి డీ.శ్రీనివాస్, మాజీ ఏజీపీ గొడుగుల మహేంద్ర, మాజీ కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు ఎంతో నష్టం చేకూరే విధంగా ఉండే ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని రద్దు చేస్తానని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి తన ఎన్నికల ప్రచారంలో చెప్పడంతో ప్రజలు, రైతులు ఉమ్మడి కూటమికి పట్టం కట్టారని, ఈ చట్టం రద్దుకోసం గతంలో న్యాయవాదులు నెలల తరబడి కోర్టులకు సంబంధించిన విధులను బహిష్కరించి ఆందోళనలు చేశారన్నారు. ల్యాండ్ టైటలింగ్ చట్టం అమల్లోకి వస్తే భూతగాదాలు వస్తే సివిల్ కోర్టులకు వెళ్లే వీలుండదన్నారు. తమ భూములను తాము అమ్ముకునే వీలు కూడా ఉండదన్నారు. ప్రజల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు నాయుడు ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే చట్టం రద్దుపైనే తన రెండో సంతకమని హామీ ఇచ్చారన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి బోర్డుల తొలగింపు

విజయనగరం రింగురోడ్డు: మహారాజా జిల్లా ఆసుపత్రిగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని 2022లో వైసీపీ ప్రభుత్వం.. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా పేరు మార్చుతూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీనిని ఆ రోజే టీడీపీ పూర్తిస్థాయిలో వ్యతిరేకించింది. ప్రజలకు ఎంతో సేవ చేసిన మహారాజా రాజవంశాన్ని అవమానించేలా వైసీపీ ప్రభుత్వం చర్యలు ఉన్నాయని అప్పట్లో టీడీపీ నాయకులు బహిరంగంగానే విమర్శించారు. జిల్లా కేంద్రాసుపత్రి ఎదుట టీడీపీ నేతలు, కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా కొత్త బోర్డును పెట్టింది. తాజాగా ప్రభుత్వం మారడంతో.. గురువారం సాయంత్రం కొంతమంది జిల్లా కేంద్రాసుపత్రికి వెళ్లి ఆ బోర్డు మీద ఉన్న అక్షరాలను తొలగించారు. అయితే దీనిపై ఆంధ్రజ్యోతి సూపరింటెండెంట్ అప్పలనాయుడిని వివరణ కోరగా, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆసుపత్రికి వచ్చి బోర్డుపై ఉన్న అక్షరాలను తొలగించారని, దీనిపై ఉన్నతాధికారు లకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

11న పైడిమాంబ కళానికేతన్ వార్షికోత్సవం

విజయనగరం దాసన్నపేట: నగరంలోని గురజాడ కళాభారతిలో ఈ నెల 11న పైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం 26వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధి ఆర్ సూర్యపాత్రో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు పైడితల్లమ్మ చదురుగుడి నుంచి కళాభారతి వరకూ కోలాటంతో ఊరేగింపు ప్రదర్శన నిర్వహిస్తామని, నృత్య ప్రదర్శన, సంగీత ట్రాక్ విభావరి వంటి కార్యక్రమాలు ఉన్నాయని, ఈ కార్యక్రమానికి ప్రముఖులు హాజరౌతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని పాత్రో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, మన్యంజిల్లా బలిజిపేట ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. బొబ్బిలి విద్యుత్ డివిజన్ పరిధిలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ బలిజిపేట ఫీడరులో చేపట్టనున్న పలు మరమ్మతు, నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరాను శుక్రవారం నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఆవాల అనంతరావు తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 33 కేవీ బలిజిపేట, వంతరాం, బొబ్బిలి మండలం పిరిడి, తెర్లాం మండలం నెమలాం, బాడంగి మండలం పినపెంకి సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా జరగదన్నారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని పూల్‌బాగ్, మహారాణిపేట ప్రాంతాల్లో కూడా అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులంతా తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ అనంతరావు ఒక ప్రకటనలో కోరారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని బొబ్బిలి రోడ్డులో మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ప్రధాన పైపులైన్ వెల్డింగ్ పనులు చేపడుతున్నందున శుక్రవారం తాగునీరు సరఫరా ఉండదని కమిషనర్ రామప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పైపులైన్లు పాడవ్వడంతో కొత్తగా విశాఖ నుంచి పైపులు తీసుకువచ్చి అమర్చామని, అయితే పైపులు వెల్డింగ్ పనులు చేపట్టాల్సి ఉన్నందున తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అయితే బొబ్బిలి రోడ్డులోని అమ్మవారి కాలనీ, మెంతిపేట, ఎస్సీ కాలనీ, ఆదర్శనగర్, కొండంపేట, మాదిగవీధి, బొబ్బిలి రోడ్డు, చాకలివీధి, వస్త్రపురికాలనీ, గోపాలపురం, కొత్తవలస, తిమ్మయ్యపేట, మల్లిఖార్జున కాలనీ, లచ్చయ్యపేట తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

రేగిడి: మండలంలో వండానిపేట గ్రామానికి బుధవారం రాత్రి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించారు. రెండురోజుల కిందట పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా దాదాపు రోజుంతా విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. ఈసమస్య రాజాం విద్యుత్‌శాఖ ఏడీఏ ఫణీంద్రకుమార్ దృష్టికి వెళ్లటంతో స్థానిక ఏఈ హరి బాబు, సిబ్బందిని అప్రమత్తంచేసి బుధవారం రాత్రి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ యుద్ధప్రాతిపదికన మార్చారు. గురువారం ఉదయానికి గ్రామానికి పూర్తిస్థాయి విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టారు. గతరెండు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులకు ఒకటిరెండుచోట్ల స్తాంబాలు కులిపోగా వీటిని పునరుద్ధరించినట్లు ఏఈ హరిబాబు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక

వేపాడ: మండలంలోని సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎం సుహాసిని 2024 విద్యాసంవత్సరానికి గాను ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి అర్హత సాధించిందని పాఠశాల హెచ్ఎం బీపీఏ రాజు తెలిపారు.

ఇది ప్రజా విజయం

- ఐదేళ్లల్లో ప్రజలకు కష్టాలే మిగిలాయి
- ఇక చంద్రబాబు హయాంలో స్వర్ణయుగమే
- టీడీపీ నేతలు నాగార్జున, అదితి గజపతిరాజు


మాట్లాడుతున్న నాగార్జున, అదితి

విజయనగరం రూరల్, జూన్ 6: తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం ప్రజల విజయంగా భావిస్తున్నామని, ఐదేళ్ల కాలంలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, ప్రభుత్వ నియంతృత్వ పోకడలతో విసుగు చెందిన ప్రజలు సునామిలా కూటమికి ఓట్లేసి గెలిపించారని టీడీపీ నాయకులు కిమిడి నాగార్జున, అదితి గజపతిరాజు చెప్పారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, 2019లో ప్రజలిచ్చిన అధికారంతో వైసీపీ నాయకులు చెలరేగిపోయారని, అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి, వారి సొంత ఎజెండాలతో ముందుకు వెళ్లిపోయారన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి అధికార గర్వంతో.. ప్రజాప్రతినిధులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. విజయనగరం జిల్లాలో అశోక్ గజపతిరాజుని మాన్సాస్ విషయాల్లో ఇబ్బందులకు గురిచేశారని, దీని వల్ల జగన్మోహన్‌రెడ్డికి ఏం వచ్చిందో తెలియదన్నారు. రామతీర్థాలు విషయంలో కూడా శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా నిరసన చేస్తే, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను, రామభక్తులను ఇబ్బందులకు గురిచేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఏ-2గా ఉన్న సాయిరెడ్డి కూడా రామతీర్థంలో హడావిడి చేశారని, రామతీర్థంలో అశోక్ గజపతిరాజును అవమాన పరచాలని చూశారన్నారు. చీపురుపల్లిలో ఆర్‌ఈసీఎస్ విషయం, అదే విధంగా రెవెన్యూ డివిజన్ అంశం తదితర అంశాలపై పోరాటాలు చేశామని గుర్తు చేశారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల కష్టాలే మిగిలాయన్నారు. ప్రజా వ్యతిరేకత మూట కట్టుకున్న ఏ ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరోసారి రుజువు చేశాయన్నారు. 1994లో విజయనగరం జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలు, పార్లమెంటు స్థానాలు టీడీపీకి దక్కాయని, మళ్లీ 30 ఏళ్ల తరువాత 2024లో ఆ విజయం పునరావృతమైందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారని, ప్రజలంతా సహకరించారన్నారు. వారికి పేరు, పేరున ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబుహయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం విషయంలో ముందుకి వెళ్తుందన్నారు. ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, కర్రోతు నర్సింగరావు, పిళ్లా విజయ్‌కుమార్, కాళ్ల గౌరీశంకర్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లపై ఆరా

- రెవెన్యూ అధికారుల ద్వారా నివేదికలు కోరిన ప్రభుత్వం

కలెక్టరేట్, జూన్ 6: జిల్లాలో ఉన్న ఇసుక రీచ్‌లపై ప్రభుత్వం ఆరా తీసింది. ప్రస్తుతం ఇసుక రీచ్‌లు ఎక్కడెక్కడ ఎన్ని నిర్వహిస్తున్నారు? అనేదానిపై రెవెన్యూ అధికారుల ద్వారా గురువారం మధ్యాహ్నం నివేదికలు కోరారు. వైసీపీ హయంలో ఇసుక రీచ్‌లు ఎన్ని నిర్వహించారు? అధికారంగా నిర్వహించారా? అనధికారికంగా నిర్వహించారా? అనేదానిపై వివరాలు కోరారు. అలాగే గత రెండు వారాలుగా నిర్వహించిన ఇసుక రీచ్‌ల ద్వారా ఎంత ఇసుక తీశారు? ఇంకా ఎంత ఇసుక నిల్వలు ఉన్నాయి? అనే వివరాలు తెలియజేయాలని కోరడంతో, మండల రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో ఆయా పరిధిలో ఉన్న ఇసుక రీచ్‌ల వివరాలను పంపించారు.

రీసర్వే గ్రామాలపై నివేకదికలు

జిల్లా వ్యాప్తంగా గత వైసీపీ హయంలో ఎన్ని గ్రామాల్లో భూములు రీసర్వే పూర్తి చేశారు? ఎన్ని సర్వే రాళ్ళు పాతిపెట్టారు? ఎంతమంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు? అధికారులు వద్ద ఎన్ని పెండింగ్ ఉన్నాయి? అనే దానిపై ఆరా తీశారు. ఇవే కాకుండా రైతులకు అందజేసిన ఫ్రీహోల్డ్ పట్టాలను వివరాలను సేకరించినట్లు తెలిసింది. ఎంతమంది రైతులకు అందజేశారు. అధికారులు వద్ద ఎన్ని ఉన్నాయి? అనే వివరాలను అందజేయాలని కోరారు.

నిలిచిన మీసేవ, సచివాలయాలు సేవలు

రాష్ట్రస్థాయిలో భూ రికార్డులకు సంబంధించి ఎటువంటి మార్పులు, చేర్పులు చేయరాదంటూ ఆదేశాలు రావడం వల్ల మీసేవ, సచివాలయాలు సేవలు గురువారం నిలిచాయి. రాష్ట్ర స్థాయిలో ఐటి సెల్ మార్పు చేయడం వల్ల ఈ సేవలు నిలిచాయి. మరోవైపు భూములు, రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు.

పార్టీని పటిష్ఠం చేస్తాం



మాట్లాడుతున్న వెంకటనాయుడు

విజయనగరం దాసన్నపేట, జూన్ 6: జిల్లాలో జైభీమ్‌రావు భారత్ పార్టీని గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సంస్థాగతంగా పటిష్ఠం చేస్తామని ఆ పార్టీ జిల్లా నాయకులు మరడాన వెంకట నాయుడు అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ ఆదేశాలతో జిల్లాలో గ్రామ, మండలాల్లో కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసిన తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి ప్రోత్సహించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నం అరుణ్‌కుమార్, పొడుగు రామకృష్ణ, టొంపల నర్సయ్య, కణిగిరి శ్రీనివాసరావు, చింతపల్లి దుర్గారావు, శంకరావు, పైలా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆటల పోటీలు


పిల్లలకు ఆటలు ఆడిస్తున్న దృశ్యం

తెర్లాం: చిన్ననాటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి కృష్ణమూర్తి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన చదవడం మాకిష్టం కార్యక్రమంలో పిల్లలకు ఇంగ్లీషు ఎలా నేర్చుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ వ్యాయమం చేయాలన్నారు. వ్యాస రచనలు, పురాణాలు, ఇతిహాస కథలు, గ్రంథాలయంలో చదివించారు. అనంతరం పిల్లలకు ఆటలు పోటీలు నిర్వహించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ


ముగింపు శిబిరంలో క్రీడాకారులు

శృంగవరపుకోట రూరల్, జూన్ 6: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలరోజులపాటు నిర్వహించిన ఉచిత బ్యాడ్మింటన్ శిబిరం గురువారంతో ముగిసింది. ప్రధాన కోచ్ పొట్నూరు శ్రీరాములు ఈ గ్రామాన్ని ఆనుకుని ఉన్న 50 మంది క్రీడాకారులకు చక్కటి శిక్షణ ఇచ్చారు. శిబిరం ముగింపులో భాగంగా టోర్నమెంట్ ఏర్పాటుచేసి విజేతలకు బహుమతులు అందించారు.

దివ్యాంగ పిల్లల సర్వే పరిశీలన


సీతంపేటలో దివ్యాంగ పిల్లల సర్వేను పరిశీలిస్తున్న డీఈవో

శృంగవరపుకోట, జూన్ 6: శృంగవరపుకోట శివారు సీతం పేటలో గురువారం జరిగిన దివ్యాంగులైన పిల్లలను గుర్తిం చేందుకు నిర్వహిస్తున్న సర్వేను మండల విద్యాశాఖాధికారులు నర్సింగరావు, గణపతి లక్ష్మి పరిశీలించారు. ఇంతవరకూ ఎంతమంది పిల్లలను గుర్తించారని ఈ సర్వే చేస్తున్న భవిత కేంద్రాల ఐఈఆర్ పీలు బి.లీలాకృష్ణ, ఆర్.శ్రీకన్యను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మే 1 నుంచి ఇంతవ రకు 20 మంది దివ్యాంగ పిల్లల వరకు గుర్తించినట్లు, భవిత కేంద్రాల్లో చేర్పేందుకు వారి తల్లిదండ్రులతో మాట్లాడినట్లు సమాధానం ఇచ్చారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటేశారు


అశోక్‌తో కోళ్ల లలిత కుమారి

విజయనగరం రూరల్/ఎస్‌కోట, జూన్ 6: ప్రజలు భయాన్ని వీడి స్వేచ్ఛగా ఓటేశారని శృంగవరపుకోట నియోజక వర్గం నుంచి నూతనంగా ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. గురువారం విజయనగరంలోని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి ఆశోక్ గజపతిరాజు, ఇదే పార్టీ నుంచి విజయనగరం నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇతని కుమార్తె అదితి గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో అన్ని స్థానాల్లోను పార్టీ గెలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి, ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాణి ఉన్నారు.

బేబీనాయనను కలిసిన గజపతినగరం ఎమ్మెల్యే


కొండపల్లికి స్వీటు తినిపిస్తున్న బేబీనాయన

బొబ్బిలి, జూన్ 6: బొబ్బిలి ఎమ్మెల్యేగా ఎన్నికైన బేబీనాయనను గురువారం సాయంత్రం గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఇద్దరూ తొలిసారిగా శాసనసభలోనికి అడుగుపెట్టనున్న నేపథ్యంలో పరస్పరం ఒకరికొకరు అభినందించుకున్నారు. రెండు కుటుంబాల మధ్య గల స్నేహ బంధాన్ని గుర్తు చేసుకున్నారు.

బేబీనాయన విజయంలో కేడరే కీలకం

రామభద్రపురం, జూన్ 6: బొబ్బిలి అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో రామభద్రపురం మండలం కీలకంగా మారింది. ఈ మండలంలో కూటమి అభ్యర్థి బేబీనాయనకు 5,422 ఓట్లు ఆధిక్యం తెచ్చిపెట్టింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి రామభద్రపురం మండలం ఆ పార్టీకి కంచుకోటగానే ఉంది. ఏ ఎన్నికలు జరిగినా టీడీపీ అభ్యర్థులకు పట్టం కట్టడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో రామభద్రపురం మండలం సాలూరు ఎస్టీ నియోజకవర్గంలో ఉండేది. అప్పుడు కూడా రామభద్రపురం మండలంలో వచ్చిన ఆధిక్యతతోనే అప్పటి టీడీపీ అభ్యర్థి భంజ్‌దేవ్ విజయం సాధించేవారు. అయితే ప్రస్తుతం రామభద్రపురం మండలాన్ని బొబ్బిలి అసెంబ్లీలో కలపడంతో ఈ మండలం కూడా నియోజకవర్గంలో కీలకంగా మారింది. అలాగే మూడేళ్లకిందట జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 22 గ్రామ పంచాయతీల్లో 13 గ్రామ పంచాయతీలను టీడీపీ మద్దతుదారులు కైవశం చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు, కుట్రలకు తెరతీసినప్పటికీ మండలప్రజానీకం టీడీపీ పక్షానే నిలిచింది. అలాగే ఎంపీటీసీ ఎన్నికల్లో కూడా 14 స్థానాలకు గాను ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులను గెలిపించినప్పటికీ వైసీపీ నాయకుల ఒత్తిడి వల్ల ఎంపీపీ పదవి తృటిలో టీడీపీ నుంచి చేజారింది. దీంతో రామభద్రపురం మండలం రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను నిలుపుకుంది. ఈ విధంగా రామభద్రపురం మండలంలో టీడీపీ కేడర్ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బలంగానే ఉంది. అయితే తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా మరోసారి సత్తాచాటుకుంది. అన్ని గ్రామ పంచాయతీల్లోనూ టీడీపీ ఆధిక్యం ప్రదర్శించింది. రామభద్రపురం మేజరు పంచాయతీలో 1800 ఓట్లు పైబడి టీడీపీ మెజార్టీ సాధించింది. అలాగే ఆరికతోట, కొట్టక్కి, రొంపల్లి, బూసాయవలస, కొండకెంగువ, కోటశిర్లాం, పెద్దపెద్ద గ్రామాల్లో కూడా బేబీనాయన ఆధిక్యతను సాధించుకున్నారు. మొదటి నుంచి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సమిష్ట కృషితో మెజార్టీ ధ్యేయంగా పనిచేశారు. ఏదిఏమైనప్పటికీ సుమారు 5 వేల ఓట్లు పైబడి ఆదిక్యం సాధించడంతో టీడీపీ కేడర్ జోష్ పుంజుకుంది.

నిలిచిన పనులు ప్రారంభమవుతాయని..

కొత్తవలస, జూన్ 6: వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎటువంటి అభివృద్ధి పనులు మొదలుకాలేదు.. కొనసాగలేదు. కానీ ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో కొత్తవలసలో పెండింగ్‌లో ఉండిపోయిన అభివృద్ధి పనులు ఈ సారి తప్పకుండా పూర్తవుతాయని మండలానికి చెందిన ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు తగినట్టుగానే నూతనంగా ఎన్నికైన కోళ్ల లలిత కుమారి కూడా ఎటూ కదలకుండా ఉండిపోయిన పనులను ఐదేళ్ల కాలంలో పూర్తి చేస్తానని చెబుతున్నారు. ముఖ్యంగా ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న కొత్తవలసలో టీటీడీ కల్యాణ మండపం పూర్తి అవుతుందని భావిస్తున్నారు. అలాగే కొత్తవలసలో డిగ్రీ కళాశాల ఏర్పాటు కూడా వైసీపీ పట్టించుకోలేదు. గిరిజన యూనివర్శిటీని ఇక్కడ నుంచి వేరే ప్రాంతం తరలిపోతున్నా స్థానిక వైసీపీ మాజీ ఎమ్మెల్యే కనీసం వ్యతిరేఖించలేదు. ఇప్పుడు ఇవన్నీ నెరవేరనున్నాయి.

పైడిమాంబను దర్శించుకున్న అశోక్


సతీసమేతంగా పూజలు చేస్తున్న అశోక్

విజయనగరం రూరల్, జూన్ 6: పైడిమాంబను గురువారం ఉదయం మూడు లాంతర్లు వద్ద ఉన్న చదురుగుడిలో అశోక్ గజపతిరాజు, సునీలా గజపతిరాజుతో పాటు, ఎమ్మెల్యే అదితి గజపతి రాజు తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అశోక్ గజపతిరాజుని ఆలయంలోకి దేవదాయశాఖ సిబ్బంది ఆహ్వానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అశోక్ కుటుంబ సభ్యులకు దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది ప్రసాదాన్ని అందజేసి, వేద పండితుల ఆశీర్వచనం అందించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

మక్కువ: భార్య ఆత్మహత్య కేసులో భర్తను అరెస్టు చేసిన ఘటన మండల కేంద్రం మక్కువలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం స్థానిక హరిజన వీధికి చెందిన తుట్ట మాధురి(39) గత నెల 22న భర్త వేధింపులు భరించలేక ఇంటిలో ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన బంధువులు, మాధురిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 1న అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరుడు గొల్లపల్లి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్య చావుకు కారణమైన భర్త తుట్ట కృష్ణను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పి.నరసింహమూర్తి తెలిపారు. తల్లి మరణించడం, తండ్రి జైలు పాలు కావడంతో ఇద్దరు కుమారులు అవినాష్, ఆకాష్ అనాథలుగా మారారు.

లక్ష్మీనరసింహ సన్నిధిలో ప్రత్యేక పూజలు


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

జామి: మండలంలోని కుమరాం ఐశ్వర్యనగర్‌లో ఉన్న శ్రీలక్ష్మీనర సింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు పూర్తయిన అనంతరం స్వామివారికి 16రోజుల పండుగను ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. ఈ పండుగలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

మొక్కలతోనే పర్యావరణ రక్షణ


మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి

రాజాం, జూన్ 6: స్థానిక ఓ పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీ కమండింగ్ అధికారి ప్రసూన్ పాండా, రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, మానవతా అధ్యక్షులు బీవీ అచ్యుతకుమార్ పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆర్‌వీజే నాయుడు, రెడ్‌క్రాస్ సభ్యుడు పెంకి చైతన్యకుమార్ తదితరులు కలిసి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 14 బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి మాట్లాడుతూ మొక్కలు నాటడం అనేది ఎన్‌సీసీలో ప్రధాన బాగమని ఎన్‌సీసీలో విద్యార్థులు ప్రజలందరు ఈబృహత్తర కార్యక్రమంలో పాలు పంచుకోవాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా సన్ స్కూల్ యాజమాన్యం వారిని ఘనంగా సత్కరించింది.

అర్బన్‌లో అత్యధిక మెజార్టీ

రాజాం: నియోజకవర్గం పరిధిలోని రాజాం పట్టణంలో టీడీపీకి అత్యధిక మెజార్టీ వచ్చిందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు అన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం ఆయన మాట్లాడుతూ రాజాం అర్బన్‌లో 24 వార్డులకు గాను 6780 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చాయని అందుకు పట్టణంలోని పార్టీ నాయకులు అందరూ కష్టపడి పనిచేశారన్నారు. అంతే కాకుండా ప్రతి సంఘం నుంచి ఆ నాయకులు కష్టపడి పనిచేయడం వలన కోండ్రు మురళీ మోహన్ విజయానికి తోడ్పాటు నందించగలిగామన్నారు. తాను పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత అన్ని వార్డుల నాయకులను కలుపుకుంటూ వెళ్లడంతోనే అధిక మెజార్టీని అందించగలిగామన్నారు. పట్టణ ప్రజలకు నంది సూర్యప్రకాష్‌రావు ధన్యవాదాలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి సన్నద్ధం

- రెండు గ్రామాల్లో సామూహిక నవధాన్యాల మిశ్రమ ప్రక్రియ



జగన్నాథపురంలో నవధాన్యాలను మిశ్రమం చేస్తున్న దృశ్యం

బొబ్బిలి, జూన్ 6: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రసాయన ఎరువు రహిత ప్రకృతి వ్యవసాయసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌లో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బొబ్బిలి మండలం జగన్నాథపురం, కృష్ణాపురం గ్రామాల్లో గురువారం ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేల సారవంతమై, ఎటువంటి తెగుళ్ల బెడద లేకుండా ఆరోగ్యకరమైన పంట దిగుబడులకు నవధాన్యాలతో తయారు చేసే ఎరువు చాలా ఉపయోగపడుతుందని రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో గల బహుళ ప్రయోజనాలను వివరించారు. రెండు గ్రామాల సర్పంచ్‌లు బొద్దల పద్మావతి సత్యనారాయణ, గంట సింహాచలం, ఎంపీటీసీ రౌతు తిరుపతి రావు, వ్యవసాయ సహాయకురాలు అలజంగి సుస్మిత, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఎన్ఎఫ్ఎఫ్ రేఖ, ఎంటి సన్యాసినాయుడు, ఉరిటి శంకరరావు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్యం, కార్మిక సంఘాల చర్చలు విఫలం

- కొలిక్కిరాని జిందాల్ పంచాయితీ

కొత్తవలస, జూన్ 6: మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారానికి సంబంధించి కార్మికులకు, యాజమాన్యానికి మధ్య గురువారం జరిగిన చర్చలు మరోసారి విఫలమయ్యాయి. గురువారం యాజమాన్య ప్రతినిధులకు, కర్మాగారానికి చెందిన మూడు కార్మిక సంఘాల మధ్య కర్మాగారంలో మరోసారి చర్చలు జరిగాయి. కర్మాగారంలో ఎంప్లాయిస్ కార్మికులుగా పనిచేసిన 57 మందికి మాత్రమే జూన్ 1 వతేదీ నుంచి లే ఆఫ్ ఇస్తామని యాజమాన్యం స్పష్టం చేసింది. యాజమాన్యం కర్మాగారంలో పని చేసిన కార్మికులను ఏవిధంగా పరిగణించినా కార్మికులందరూ గత 40 సంవత్సరాలుగా పని చేస్తున్నందున అందరికీ లే ఆఫ్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. యాజమాన్యం మాత్రం 57 మంది ఎంప్లాయిస్‌ని కార్మికులుగా, 264 మందిని కాంట్రాక్టు కార్మికులని లెక్కలు చెబుతూ 264 మంది కార్మికులకు లే ఆఫ్ ఇవ్వలేమని చెప్పింది. అందరూ కర్మాగారంలో పనిచేసే రెగ్యులర్ కార్మికులేనని అందుచేత అందరికీ లే ఆఫ్ ప్రకటించి లాకౌట్ ద్వారా మూసుకోవాలని, అంతవరకూ తాము ఆందోళనలు చేసుకుంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని కార్మిక సంఘాలకు చెందిన నాయకులు తెలిపారు. కార్మిక చట్టాల ద్వారా తమకు రావలసిన అన్ని ప్రయోజనాల కోసం పోరాటాలు చేయక తప్పదని కార్మిక సంఘాలకు చెందిన నాయకులు తెలిపారు. మరోవారం రోజులలోగా యాజమాన్యం తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశాయి. ఈ చర్చల్లో యాజమాన్యం తరపున స్థానిక ప్రతినిధులు గోపాలకృష్ణ, దినేష్ శర్మ, డిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధి పాల్గొనగా కార్మికసంఘాలైన టీఎన్‌టీయూసీ, సీఐటీయూ, వైసీపీ ట్రేడ్‌యూనియన్‌కు చెందిన నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు, నమ్మి చినబాబు, బొట్టా రాము, నెక్కల నాయుడుబాబు, కోన దేముడు, వామాలు, మేలాస్త్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. కార్మిక సంఘాలతో యాజమాన్యం చర్చలు జరిపినప్పటికీ కార్మికులు కర్మాగార గేట్ ముందు నినాదాలతో నిరసన తెలిపారు.


గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కూటమి శ్రేణుల విజయోత్సవం

- విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనల వెల్లువ
- నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు


గుమ్మలక్ష్మీపురం: కార్యకర్తలకు అభివాదం చేస్తున్న జగదీశ్వరి


వీరఘట్టం: జయకృష్ణకు అభినందనలు తెలియజేస్తున్న నాయకులు


పార్వతీపురం: కూటమి నాయకులతో సీతారాం, భాస్కరరావు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం ఎమ్మెల్యేగా విజయం సాధించిన తోయక జగదీశ్వరిని అభినందించడానికి కూటమి కార్యకర్తలు, నాయకులు గుమ్మల క్ష్మీపురంలోని ఆమె స్వగృహానికి పెద్దఎత్తున తరలివస్తున్నారు. వారికి ఆమె కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు పాడి సుధ, విప్లవకుమార్ ఉన్నారు. కురుపాం నియోజకవర్గ జనసేన నాయకుడు కద్రక మల్లేష్, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు తదితరులు గురువారం జగదీశ్వరి ఇంటికి వెళ్లి అభినందనలు తెలిపారు.

● **జియ్యమ్మవలస:** కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి, మన్యం జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మరడ సింహాచలంనాయుడు గురువారం ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. వీఆర్వోల సమస్యలు కూడా ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బోనెల విజయచంద్రకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రతిఒక్కరికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు టీడీపీ సీనియర్ నాయకులు బార్నాల సీతారామారావు, సిరిపురపు భాస్కరరావు అన్నారు. పట్టణంలోని రెండో వార్డుతో పాటు 28 వార్డుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులను కలిసి అభినందించారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

● **వీరఘట్టం:** ఎం.రాజపురం గ్రామంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు అభినందనలు తెలిపేందుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు గురువారం పెద్దఎత్తున తరలివచ్చారు. 20 ఏళ్ల తర్వాత ఎం.రాజపురంలో సందడి వాతావరణం నెలకొంది.

● **భామిని:** బత్తిలి గ్రామంలో బీజేపీ, జనసేన అభిమానులు గురువారం బైకు ర్యాలీ నిర్వహించారు. బత్తిలి సమీప గ్రామాల నుంచి ఒడిశాలో బీజేపీ గెలవడంతో వారితో పాటు జనసేన అభిమానులు బత్తిలి గ్రామంలో బైకు ర్యాలీ నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం రావడంపై ఆ పార్టీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే నియోజకవర్గంలో జనసేన గెలవడం ఆనందదాయకంగా ఉందన్నారు.

● **మక్కువ:** సాలూరు ఎమ్మెల్యేగా గుమ్మిడి సంధ్యారాణి విజయం సాధించడంతో స్థానిక హరిజన, రామిరెడ్డి, బీసీ కాలనీ, ఆర్‌సీఎం వీధుల్లో గురువారం టీడీపీ నాయకుడు మావుడి ప్రసాదరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి ఖాయమన్నారు. ఈ కార్యక్రమం లో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.


భామినిలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన, బీజేపీ అభిమానులు


మక్కువ: సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి

మక్కువ: కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జనసేన సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషవర్ధన్ అన్నారు. వెంకట భైరిపురం గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ఆయన గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి విజయకేతనం ఎగురవేయడంతో రాష్ట్రంలో 21 ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లను జనసేన కైవసం చేసుకోవడం ఆనందదాయకం అన్నారు. ఈ ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి ఖచ్చితంగా జరుగుతుందన్నారు. జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

విజయనగరం జిల్లాలో..

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీ నాయన)కు గురువారం అభినందనల వెల్లువ కొనసాగింది. వేల సంఖ్యలో బొబ్బిలి కోటకు తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనకాపల్లికి చెందిన బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు మళ్ల సురేంద్ర గురువారం బేబీనాయనను కలిసి అభినందనలు తెలిపారు. శ్రీనూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించి దుశ్శాలువతో సత్కరించారు. అనకాపల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ కాయల మురళీధర్, పిట్ల రాజు, తిప్పన అప్పారావు, ఎండకుర్తి అప్పలరాజు, భానుచందర్(అఖి), జొన్నాడ సురేష్ పాల్గొన్నారు.

● బొబ్బిలి బ్రహ్మకుమారీస్ రాజేశ్వరి ఆధ్వర్యంలో బేబీనాయనకు కిరీటం అలంకరించి, దేవుని చిత్రపటాన్ని, మొక్కను అందజేసి ఆశీర్వాదాలు అందజేశారు. బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

● రామభద్రపురం మండలానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులతో పాటు హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు పెంట స్వామినాయుడు, అల్లు స్వామినాయుడు, ఆనందోబ్రహ్మ ప్రతినిధులు మింది విజయమోహన్, అప్పలనాయుడు, రాముడువలసకు చెందిన కోలాటం కళాకారులు బేబీనాయనకు అభినందనలు తెలిపారు.

● **డెంకాడ:** మండలంలోని 26 పంచాయతీల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పనిచేసి, కూటమి అభ్యర్థి లోకం నాగమాధవిని గెలిపించుకున్నామని మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. అక్కివరం గ్రామంలోని తన నివాసంలో నాలుగు మండలాల కూటమి నాయకులు విజయోత్సవాలు చేసుకున్నారు. ఎన్నడూ లేని విధంగా మండలంలో 7,500 ఓట్ల మెజార్టీ వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

● **నెల్లిమర్ల:** నెల్లిమర్ల ఎమ్మెల్యేగా లోకం నాగమాధవి విజయం సాధించిన సందర్భంగా నగర పంచాయతీ పరిధిలోని 8వ వార్డులో టీడీపీ నాయకులు రెడ్డి వేణు, రెడ్డి సంతోషికుమారిల ఆధ్వర్యంలో గురువారం సంబరాలు చేశారు. వార్డులోని ప్రతిఇంటికి వెళ్లి స్వీట్ బాక్స్ డ్రింక్ బాటిల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కిరి మణికంఠ, పంచాది కిరణ్‌కుమార్, గురాన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **గంట్యాడ:** గజపతినగరం శాసన సభ్యుడిగా గెలుపొందిన కొండపల్లి శ్రీనివాస్‌ను టీడీపీ మండల నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. కొండపల్లి భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచుకున్నారు. అనంతరం పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.


బొబ్బిలి: బేబీనాయనకు ఆనంద్‌బ్రహ్మ బాల కళాకారుల అభినందన


నెల్లిమర్ల: స్వీట్ బాక్స్, డ్రింక్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న రెడ్డి వేణు


గంట్యాడ: ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు


డెంకాడ: అక్కివరంలోని చంద్రశేఖర్ నివాసంలో విజయోత్సవాలు

ప్రిజం-10 పరిశీలనకు నేడు కేంద్ర బృందం


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్

సాలూరు రూరల్: జిల్లాలో శిశు మరణాల నియంత్రణకు అమలవుతున్న ప్రిజం-10 (శిశు మరణాల నివారణ కార్యక్రమం) పరిశీలనకు కేంద్ర ఆరోగ్యశాఖ బృందం ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు పరిశీలనకు పర్యటించనున్నది. జన్మించిన ఏ బిడ్డ కన్నుమూయరాదనే లక్ష్యంతో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రిజం-10 కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులను ఆరోగ్య సిబ్బందికి దత్తత ఇస్తారు. తన దత్తత పరిధిలో ఉన్న గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఆ అధికారి నెలకు మూడు సార్లు వెళ్లి పరిశీలిస్తారు. హిమోగ్లోబిన్, బీపీ తదితర వాటిని పరిశీలిస్తారు. వారి ఆరోగ్య పరిస్థితి మెడికల్ ఆఫీసర్‌కు నివేదిస్తారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై సందేహముంటే వెంటనే చికిత్స అందిస్తారు. ఆమె ప్రసవంలో ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చే విధంగా ఆరోగ్య సిబ్బంది శ్రద్ధ తీసుకుంటారు. ఈ జిల్లాలో అమలవుతున్న ఈ కార్యక్రమాన్ని పరిశీలించడానికి కేంద్ర ఆరోగ్య శాఖ పరిశీలకులు వస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి

జిల్లాలో ప్రిజం10 పరిశీలనకు కేంద్ర ఆరోగ్యశాఖ పరిశీలకులు వస్తున్నందున ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డి.శివకుమార్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం సాలూరు వైటీసీలో మామిడిపల్లి, సాలూరు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైద్య సిబ్బందికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే శంబర, మక్కువ పీహెచ్‌సీలో జరిగిన సమావేశాల్లో పాల్గొని సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో ఈ సమావేశాలను వైద్యాధికారులు నిర్వహించి పరిశీలకులు తమ పరిధిలో పర్యటిస్తే వివరించాల్సిన విషయాలను తెలిపారు.

శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు


గర్భిణులకు వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: గ్రామాల్లో శిశు మరణాల శాతం తగ్గించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని చినగుడబలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత కారణంగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. దీని నివారణకు వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ, సచివాలయాల సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేస్తుందని చెప్పారు. గతంలో 7 శాతం ఉండేదని, ప్రస్తుతం 9 శాతానికి పైగా చేరుకుంద న్నారు. శాఖల సమన్వయంతో రక్తహీనత నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అలాగే హైరిస్క్ ఉన్న గర్భిణులపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రసవాలు జరిగేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవసరమైన పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్న వారికి మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. రోగాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ శిబిరంలో సిబ్బంది ఉదయ్‌కిరణ్, మౌనిక, ఈశ్వరి, రమేష్‌తో పాటు 104 సిబ్బంది దుర్గాప్రసాద్, శంకరరరావు ఉన్నారు.

మంత్రి వర్గంలో ఇద్దరు గిరిజనులకు స్థానం కల్పించాలి

● ట్రైబుల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో సుమారుగా 30 లక్షల గిరిజన జనాభా ఉన్న మేరకు ఇద్దరు గిరిజన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వాలని ట్రైబుల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బ లోవరాజు కోరారు. గుమ్మలక్ష్మీపురంలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గిరిజన సంక్షేమంతో పాటు అటవీ శాఖకు కూడా చాలా ప్రాధాన్యత ఉందన్నారు. మంత్రివర్గంలో గిరిజన సంక్షేమంతో పాటు అటవీ శాఖ కూడా కేటాయిస్తే ఏజెన్సీ ప్రాంతాలు చాలా వరకు అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ మేరకు నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచించి ఇద్దరు గిరిజన ఎమ్మెల్యేలకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ఆయన కోరారు.

రక్తహీనత నిర్మూలనకు కృషి చేయండి


మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం

వీరఘట్టం: మండలంలోని గర్భిణులు, బాలింతలు, బాలల్లో రక్తహీనతను గుర్తించి నమోదు చేయాలని ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అన్ని శాఖల వారు సమన్వయంతో రక్తహీనత ఉన్నవారిని గుర్తించి ప్రతినెలా వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శివున్నాయుడు, లలితకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లోనూ వైసీపీకి మైనస్ ఓట్లే

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు పార్వతీపురం నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో ఓటర్లు మెజార్టీని అందించారు. ఆయన జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలో 19,028 ఓట్లు రాగా వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావుకు 8,933 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా పార్వతీపురం మండలంలో విజయచంద్రకు 22,216 ఓట్లు రాగా, వైసీపీకి 17,572 ఓట్లు వచ్చాయి. సీతానగరం మండలంలో టీడీపీకి 20,781 ఓట్లు రాగా వైసీపీకి 17,615 ఓట్లు వచ్చాయి. బలిజిపేట మండలంలో టీడీపీ 19,963 ఓట్లు రాగా, వైసీపీకి 16,498 ఓట్లు వచ్చాయి. ఈవిధంగా నియోజకవర్గ పరిధిలో పార్వతీపురం పట్టణంతో పాటు పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాల్లో వైసీపీకి టీడీపీ అభ్యర్థి కంటే తక్కువ ఓట్లు వచ్చాయి.

కామాక్షి ఆలయంలో హోమాలు


కామాక్షి ఆలయంలో హోమం, ప్రత్యేక అలంకరణలో పారమ్మతల్లి

సాలూరు రూరల్: వైశాఖ అమావాస్య సందర్భంగా సాలూరు కామాక్షి అమ్మవారి దేవాలయంలో హోమ పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పారమ్మకొండ శిఖరాన ఉన్న పారమ్మతల్లికి అమావాస్య సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. పలువురు భక్తులు కొండ ఎక్కి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

మా సమస్యలు పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం

● ఏపీ ఎన్జీవో సంఘ నాయకుడు కిషోర్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న నారా చంద్రబాబునాయుడు తమ సమస్యలను పరిష్కరిస్తారని తాము ఎంతో ఆశిస్తున్నామని ఏపీ ఎన్జీవో సంఘ నాయకుడు జీవీఆర్‌ఎస్ కిషోర్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన తమకు జీతాలు అందించాలని, అదేవిధంగా దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు చెప్పారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి /గుమ్మలక్ష్మీపురం: ఐదేళ్లపాటు అన్నింటా అభివృద్ధిలో వెనుకబడిపోయిన కురుపాం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గురువారం ఆమె విలేకర్లతోనూ, గుమ్మలక్ష్మీపురంలోని తన స్వగృహంలోనూ మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి గిరిజన గ్రామానికి రహదారి సదుపాయం కల్పించేందుకు తాను కృషి చేస్తానన్నారు. పూర్ణపాడు, లాబేసు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని చెప్పారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా ఇంటింటికి కొళాయి పథకాన్ని అమలు చేస్తానన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో ఏర్పాటుచేసిన గర్భిణుల వసతి గృహాలకు పూర్వవైభవం తీసుకొస్తానని హామీ ఇచ్చారు. వైటీసీల ద్వారా టీడీపీ ప్రభుత్వ కాలంలో నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో స్థిరపడేందుకు అవసరమైన శిక్షణను ఇచ్చామని, వైసీపీ ప్రభుత్వం కాలంలో ఇది లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైటీసీల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు వారు ఉపాధి పొందే విధంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు పునఃప్రారంభిస్తామన్నారు. తన విజయం ప్రజా విజయమని, తన విజయం కోసం కృషిచేసిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలకు పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. గుమ్మలక్ష్మీపురంలో జరిగిన సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుధ, కురుపాం నాయకులు విప్లవకుమార్, గిరిజన నాయకుడు లోవరాజు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ సాయినామ సప్తాహం


బాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో గత నెల 30వ తేదీన ప్రారంభమైన 22వ వార్షికోత్సవం, 18వ అఖండ సాయినామ సప్తాహం గురువారంతో ముగిసింది. ఈసందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలతో పాటు బాబా విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలపై విద్యార్థుల ఆసక్తి

గరుగుబిల్లి: శాఖా గ్రంథాలయాల పరిధిలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలపై విద్యార్థులు ఆసక్తి కనపరుస్తున్నారు. గురువారం పుస్తక పఠనంతో పాటు క్రీడా పోటీలు నిర్వహించామని నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు తెలిపారు. విజేతలకు బహుమతులు అందించారు. ● **పాలకొండ:** స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు వ్యాసరచన, ఖోఖో పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 7న ముగింపు రోజున బహుమతులు అందించనున్నట్టు గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు తెలిపారు. కాగా, వేసవి శిక్షణా తరగతులను గ్రంథాలయాధికారి జిల్లా కార్యదర్శి బి.కుమార్‌రాజు, గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి వీవీవీజీ శంకర్ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, పాఠకులు పాల్గొన్నారు.


వివిధ క్రీడలు ఆడిస్తున్న దృశ్యం



పాలకొండ: వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

చంద్రబాబును కలిసిన రంజిత్‌కుమార్



కురుపాం: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న చంద్రబాబునాయుడును రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్ గురువారం అమరావతిలో కలిశారు. ఈసందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. అలాగే చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వరి విత్తనాలు సిద్ధం

భామిని: ఖరీఫ్‌కు వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఏడీఏ రత్నకుమారి తెలిపారు. భామిని రైతు భరోసా కేంద్రంలో రైతులు, డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు నిషేధిత విత్తనాలను విక్రయించరాదన్నారు. ఈ విత్తనాల వల్ల భూసారం పూర్తిగా నాశనం అయిపోతుందన్నారు. పంట మార్పిడికి రైతులు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఈసందర్భంగా ప్రతి ఆర్బీకేలో రైతులు వరి విత్తనాలు, ఆధార్, పాస్‌పుస్తకంతో నమోదు చేసుకుని విత్తనాలు విడిపించుకోవచ్చునని సూచించారు. భామినిలో పలువురు రైతులకు విత్తనాలు అందించారు. ఏవో మన్మథరావు, రైతులు పాల్గొన్నారు.


విత్తనాలు అందుకున్న రైతులు

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

వీరఘట్టం: మండలంలోని చిట్టిపుడివలస జంక్షన్‌లో ఉన్న శ్రీసత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సహకారంతో రోగులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు అలేఖ్య 103 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీతో రాష్ట్రం మరింత పురోభివృద్ధి


మాట్లాడుతున్న ఉలక

ఒడిశా

రాయగడ: నరేంద్ర మోదీపై నమ్మకంతో ఒడిశా ప్రజలు.. 24 ఏళ్ల నవీన్ పట్నాయక్ పాలనకు స్వస్తి చెప్పారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాయగడ ఎమ్మెల్యే అభ్యర్థి బసంత ఉలకా అన్నారు. ఈమేరకు స్థానిక సెరిగుడలో ఉన్న బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉండడంతో మన రాష్ట్రం మరింత పురోభివృద్ధి చెందుతుంద న్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాభివృద్ధికి పాటుపడతామని హామీఇచ్చారు. విజయాన్ని అందించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుల మినియక తదితరులు పాల్గొన్నారు.